బీఆర్ అంబేడ్కర్ సేవలు నిరుపమానం

వాడవాడలా రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

గన్నవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సేవలు నిరుపమానమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో వాడవాడలా బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. గన్నవరం శాసనసభ్యుని కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని నేతలు కొనియాడారు. జేఏసీఎస్ కన్వీనర్ కై లే శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ చిమట శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.కరిముల్లా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు పాలిమేర పేత్రు, నాయకులు పడమట సురేష్, మెండెం రాంబాబు, ఎస్‌కెఎంఎం ఏ.కలాం, తిరివీధి రంగారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. కేసరపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, మాల మహానాడు నాయకులు మెండెం రాంబాబు తదితరులు నివాళులర్పించారు.



గన్నవరంలో ఎమ్మెల్యే కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నేతలు



ఉంగుటూరులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సరోజిని, అధికారులు

ప్రజల మనసుల్లో నిలిచిపోతారు

ఉంగుటూరు: ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించి భారత దేశానికి బంగారు బాటలు వేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచపోతారని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, గ్రామ సర్పంచ్ వరప్రసాద్, ఎంఈవో–2 సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

నున్న(విజయవాడరూరల్): అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి మంద వేణుబాబు మాదిగ అన్నారు. బుధవారం నున్న గ్రామంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొకినేల లక్ష్మణరావు, కారుమూడి రమేష్, ఉయ్యూరు రమేష్, తగరం అనిల్, ఏసుపోగు కిరణ్ పాల్గొన్నారు.

యనమలకుదురులో

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో సమతా యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. పెనమలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ నేనావత్ చిన్ని గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అంబేడ్కర్ ఆశయాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకొని అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం చేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా పేదలకు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్, డాక్టర్ అయోధ్య సత్యానారాయణ, సుకుమార్, నక్షత్రరావు, కోటి, రాజేష్ పాల్గొన్నారు.

పెనమలూరు పీఎస్‌లో..

పెనమలూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు నిరుపమానమని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అసమానతలు, విబేధాలను అధికమిస్తూ దేశం బలమైన శక్తిగా ఎదుగుతుందంటే అందుకు కారణం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమేనన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

కంకిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. డీబీపీఎస్ ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి దయాకర్, నాయకులు కె.శివయ్య, జంపన వెంకటేశ్వరరావు, సునీల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో కంకిపాడు లాకులు వద్ద అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిమ్నవర్గాల రాజ్యాంగ హక్కుల కోసం దళితులు ఐక్యంగా, పార్టీలకు అతీతంగా పోరాడాలని కోరారు. సంఘం నేతలు పి.రామకృష్ణ, బేతాళ అజయ్‌బాబు పాల్గొన్నారు.



యనమలకుదురులో నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ నేనావత్ చిన్ని



కంకిపాడులో నివాళులర్పిస్తున్న మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు



పెనమలూరు పీఎస్‌లో..

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

ఉయ్యూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా జగనన్న ప్రభుత్వం ముందుకు సాగుతుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, పట్టణఅధ్యక్షుడు షేక్ అబుకలాం, పలువురు నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- నీట మునిగిన పంట పొలాల పరిశీలన

పెనమలూరు: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. చోడవరం, పెనమలూరు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతుల పంట పది రోజుల్లో చేతికి వచ్చే సమయంలో తుపాను కారణంగా కురిసిన వర్షాలు, ఈదురు గాలులు కారణంగా వరి పంట నీట మునిగిందన్నారు. రైతుల వద్ద ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈ లోపు తుపాను రైతులకు కష్టాలు మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంటనే డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టి పొలాల్లో నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తడిచిన ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫోన్‌లో వివరించారు.



చోడవరంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

4 వేల ఎకరాల్లో పంట నష్టం

ఎమ్మెల్యే పర్యటనలో అధికారులు వివరాలు తెలుపుతూ తుపాను కారణంగా మండల పరిధిలో దాదాపు 4 వేల ఎకరాల వరి పంట నష్టం జరిగిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 1061 రకం వరి పూర్తిగా నేలవాలి నీట మునిగిందని చెప్పారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి పంట నష్టం వివరాలు అధికారులు సేకరించాలన్నారు. ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సూరంపల్లిలో వరి పంట పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

దాళ్వాకు అనుమతి ఇవ్వండి..

రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. ఈ ఏడాది దాళ్వా సాగును ప్రభుత్వం అనుమతి ఇచ్చే విధంగా చూడాలని కోరారు. దాళ్వాకు ప్రభుత్వం అనుమతులు ఇస్తేనే గిట్టుబాటు ధర వస్తుందన్నారు లేని పక్షంలో మిల్లర్లు రైతులకు ధర చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. రైతులకు బీమా వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి దాళ్వాకు అనుమతులు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లింగాల భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, ఏఎంసీ డైరెక్టర్ మండూరు కోటేశ్వరరావు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

సూరంపల్లిలో జిల్లా వ్యవసాయాధికారి..

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి పర్యటించారు. గ్రామంలోని వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేలవాలిన వరి పంటను 3 లేదా 4 దుబ్బులను కలిపి ఒకటిగా కట్టి ఉంచుకోవాలని సూచించారు. తడిసిన పనలను ఉప్పు ద్రావణంతో పిచికారీ చేయాలన్నారు. స్థానిక ఆర్‌బీకే పరిశీలించారు. ఏడీఏ ఎం.సునీల్, ఎంఏవో ఎన్ఎల్ తేజశ్వి, వీఏఏ రవితేజ, హెచ్ఏ దీక్షా పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి

ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ముమ్మాటికీ ఖాయమని ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఘంటాపథంగా చెప్పారు. హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని కొమ్మినేనికి బహుకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ పలు సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ప్రతిపక్షాలతో కలిసి ఎల్లో మీడియా ఎంత యాగీ చేసిన ప్రజల అభిప్రాయాన్ని మార్చలేదని కొమ్మినేని స్పష్టం చేశారు. దీనికి తెలంగాణ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలకుండా ఈనాడు పత్రికల్లో వార్తలు రాసినప్పటికీ ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం మార్చలేకపోయారని, అలాగే ఏపీలోనే ఎల్లో మీడియా సీఎం వైఎస్ జగన్‌పై ఎంత దురద జల్లినా ప్రజలు విశ్వసించబోరని తేల్చి చెప్పారు. 2024లో మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటం ద్వారా రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీ మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాల గంగాధర్ తిలక్, ఓఎస్డీ శ్రీనివాస్ జీవన్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు బడే ప్రభాకరరావు, తాడి రంగారావు, చలమలశెట్టి శ్యామ్, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

బాలిక అదృశ్యంపై కేసు

పెనమలూరు: గోసాలలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల సాయిబాబా గుడి కట్టపై షేక్ అమీర్ భార్య, పిల్లలతో నివసిస్తున్నాడు. అమీర్ భార్యతో కలిసి గోసాల సెంటర్‌లో టిఫిన్ బండి నడుపుతున్నాడు. అతనికి కుమార్తె(16), కుమారుడు సలీం ఉన్నారు. కాగా వీరు గతంలో గుంటూరులో ఉండి రెండు నెలల క్రితం గోసాలకు వచ్చారు. అయితే ఈ నెల 3న తల్లిదండ్రులు టిఫిన్ బండి వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లో కుమార్తె ఒక్కటే ఉంది. తల్లిదండ్రులు వ్యాపారం ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా కుమార్తె ఇంటిలో లేదు. బంధువులను ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో అమీర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ నాయకుడు తోడేటి బెంజ్‌మెన్ తండ్రి తోడేటి సంసోను(75) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, చెన్ను ప్రసన్నకుమారి, మేచినేని బాబు, అంబాపురం గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, ఏపీ నవరత్నాలు హౌసింగ్ స్టేట్ నోడల్ అధికారి విజయకుమార్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు సంసోను పార్థివదేహానికి నివాళులర్పించారు.

నీటి ముంపులోనే పంట పొలాలు

- సస్యరక్షణ చర్యల్లో రైతులు నిమగ్నం
- అన్నదాతలకు అండగా అధికారులు

కంకిపాడు/పెనమలూరు/ఉయ్యూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షానికి, ఈదురుగాలులకు పంట పొలాలు నేలవాలాయి. వర్షపు తీవ్రత అధికంగా ఉండటంతో నేలవాలిన వరి దుబ్బులు మీదుగా వర్షపునీరు ప్రవహించింది. వరి పనలు నీట మునిగాయి. బుధవారం వాతావరణం తెరపివ్వటంతో రైతులు సస్యరక్షణ చర్యల వైపు దృష్టి సారించారు. పొలాల్లో ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా పంట బోదెల్లోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ, రెవెన్యూ అధికారులు పంట పొలాలను సందర్శించి యాజమాన్య చర్యలను రైతాంగానికి వివరించారు. పంట నష్టం అంచనాలను ప్రాథమికంగా నమోదు చేస్తున్నారు. తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, జగనన్న లేఅవుట్‌లలో నీరు నిలిచిపోయింది. స్థానిక సంస్థల ప్రతినిధులు పొక్లెయినర్‌లతో నీటి మళ్లింపు పనులను చేపట్టారు.

రక్షణ చర్యల్లో రైతులు

గన్నవరం: మండలంలో ముంపునకు గురైన పంటలను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ముఖ్యంగా బుద్దవరం, దావాజిగూడెం, అల్లాపురం, కేసరపల్లి, అజ్జంపూడి గ్రామాల పరిధిలో ఈదురు గాలులకు ఎక్కువ శాతం వరిపైరు నెలకొరిగింది. దీంతో వరిపైరును కాపాడుకునేందుకు రైతులు పొలాల్లోని నీటిని బయటకు తరలిస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే యంత్రాలతో కోత కోసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కోత కోసిన పనలు నీట మునగకుండా రైతులు గట్టుకు చేర్చుతున్నారు. మధ్యాహ్నం నుంచి ఎండ రావడంతో పొలాలు ముంపు నుంచి బయటపడుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మరో వైపు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేస్తున్నారు.



గండిగుంటలో నీటిని ఇంజన్లతో తోడిస్తున్న రైతులు, పరిశీలిస్తున్న ఏఓ నిస్సిగ్రేస్



పెద ఓగిరాలలో అరటి చెట్లకు వాసాలను నిలబెడుతున్న రైతులు, వీఏఏలు

15,500 ఎకరాల్లో పంట నష్టం

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 15,500 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. వర్షం బుధవారం తెరపివ్వడంతో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు. పంట పొలాల్లో నిచిన నీటిని బయటకు పంపే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

8,785 ఎకరాల్లో వరి పంటకు నష్టం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలో 8785 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. మండలంలోని ఆరుగొలను, ఓగిరాల, కానుమోలు, కాకులపాడు గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. వరి పంట కోయకుండా 3,472 ఎకరాల్లో నీట మునిగిందని, మరో 5,313 ఎకరాల్లో నేలకు ఒరిగిపోయిందని ఆమె చెప్పారు. 400 ఎకరాలలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని వివరించారు. వరద నీటిని బయటకు తీసివేసేందుకు, పడిపోయిన వరిపైరును కట్టలు కట్టేందుకు, వరిపైరుపైన ఉప్పునీళ్లు చల్లేందుకు ఉపాధి హామీ పథకం కూలీలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించినట్లు ఆమె రైతులకు చెప్పారు.



చోడవరంలో బోదెలో తూడు తొలగిస్తున్న కూలీలు



ఆరుగొలనులో వరి పనలను చూపుతున్న రైతులు

క్లుప్తంగా

మల్లవల్లి పారిశ్రామికవాడకు రేపటి నుంచి బస్సు సర్వీస్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ నుంచి మల్లవల్లి పారిశ్రామికవాడకు ఈ నెల 8వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభించనున్నట్లు గన్నవరం డిపో మేనేజర్ పి.శివాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో బయలుదేరి 8.30 గంటలకు మల్లవల్లి మల్లవల్లి పారిశ్రామికవాడకు చేరుతుందన్నారు. సాయంత్రం 5.45 గంటలకు మల్లవల్లి పారిశ్రామికవాడ నుంచి బయలు దేరి 6.15లకు హనుమాన్‌జంక్షన్ చేరుతుందని చెప్పారు. మల్లవల్లిలోని వివిధ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఈ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

11న అమ్మవారి చీరల బహిరంగ వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాల సందర్భంగా పార్వతీదేవి అమ్మవారికి అలంకరించిన చీరల బహిరంగ వేలం ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈఓ ఎం.గంగాధర్‌రావు తెలిపారు. పాటదారులు వేలంలో పాల్గొని చీరలను కొనుగోలు చేయాలని సూచించారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



కంకిపాడు: రక్షిత తాగునీటి సరఫరాకు మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో తాగునీటి పైపులైను విస్తరణ పనులు బుధవారం చేపట్టారు. సర్పంచ్ విజయ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, మెరుగ్గా నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

కొండచిలువ కలకలం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు మసీదు సెంటర్‌లో మంగళవారం రాత్రి కొండచిలువ రావడంతో దాన్ని స్థానికులు హతమార్చారు. గ్రామంలోని ఉర్దూ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లోకి కొండచిలువ రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ పాఠశాల రోడ్డులో నిర్మానుష్య ప్రాంతంలో కాలువలో నుంచి కొండచిలువ వచ్చినట్లు అనుమానిస్తున్నారు. తుపాన్ ప్రభావంతో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కొండ చిలువ వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అప్రమత్తమైన స్థానికులు దాన్ని హతమార్చారు.

కొట్లాట కేసులో నిందితుడికి జైలు

విజయవాడస్పోర్ట్స్: న్యూ ఆర్ఆర్‌పేటలోని ఓ టీ స్టాల్ వద్ద గత ఏడాది నవంబర్ 24వ తేదీన జరిగిన కొట్లాట కేసులో నిందితుడు గోనా కిషోర్‌కు నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సి.రమణారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. టీ స్టాల్ వద్ద టీ తాగుతున్న ఓ వ్యక్తిని డబ్బులు ఇవ్వమని నిందితుడు కిషోర్ బెదిరించాడు. డబ్బులు లేవని చెప్పడంతో నిందితుడు కిషోర్ తనపై పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఐదుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు కిషోర్‌కు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

ఉధృతంగా గుంటతిప్ప డ్రెయిన్

ఆటోనగర్(విజయవాడతూర్పు): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుంటతిప్ప డ్రెయిన్ ఉధృతంగా పారుతుంది. వర్షం కారణంగా భారీ స్థాయిలో నీరు వస్తుంది. ఈ డ్రెయిన్ లోతు సుమారు 7 అడుగులకు పైగా ఉంటుంది. పంట కాలువ నుంచి బల్లెం వారి వీధి వరకు ఈ డ్రెయిన్ ఉంది. శానిటేషన్ సిబ్బంది వరద నీటినిఇంజిన్ల సహాయంతో గుంటతిప్ప డ్రెయిన్‌లోకి మళ్లించడంతో నీరు భారీగా చేరింది. సమీపంలోని పలు కాలనీలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. మురుగు కాలువల్లో ఉన్న వ్యర్థాలన్నీ కొట్టుకు వస్తున్నాయి.

వరద నీటిలో రాకపోకలు

నున్న(విజయవాడరూరల్): మిచాంగ్ తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు విజయవాడ – నూజివీడు ఆర్అండ్‌బీ రహదారి నున్న పవర్‌గ్రిడ్ సమీపంలో వరద నీరు ప్రవహిస్తోంది. రోడ్డుపై వరద నీరు రోడ్డు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, నున్న గ్రామాల్లోని పంట పొలాల నీరు బయటకు రావడంతో రోడ్డుపై వరద ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.